కోడి పందేల స్థావరాలపై పోలీసుల దాడి

సత్తుపల్లిరూరల్, మార్చి10: మండలంలోని రేజర్ల శివారులో కోడిపందేల స్థావరంపై సత్తుపల్లి సీఐ కిరణ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం దాడి చేశారు. ఏడుగురు వ్యక్తులు, 9 వాహనాలు, 4 సెల్ ఫోన్లు, రెండు కోడిపుంజులు, రూ.4,070 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్సైలు శ్రావణ్‌కుమార్, ఖుష్‌కుమార్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

వడుగు రవికుమార్ (ఫైల్)

సత్తుపల్లి రూరల్, మార్చి 10: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని యాతాలకుంటలో ఆదివారం చోటుచేసుకున్నది. హెడ్‌కానిస్టేబుల్ చెన్నారావు తెలిపిన వివరాల ప్రకారం... యాతాలకుంట గ్రామానికి చెందిన వడుగు రవికుమార్ (38) నూతనంగా గృహాన్ని నిర్మించాడు. అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురై శనివారం రాత్రి పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి తిరుపతమ్మ, కుమారులు గురుచరణ్‌తేజ, రేవంత్ ఉన్నారు. మృతుడి సోదరుడు లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరు మృతి

షబీర్ (ఫైల్)

రాజిరెడ్డి (ఫైల్)

ఖమ్మంరూరల్, మార్చి 10 : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖమ్మంరూరల్ మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. వివరాల్లోకెళ్తే.. ఖమ్మంరూరల్ మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్డులో నివాసం ఉంటున్న షబీర్(36), రాజిరెడ్డి (37) గత కొద్ది సంవత్సరాలుగా గ్రానైట్ వ్యాపారం చేస్తున్నారు. ఈక్రమంలో ఛత్తీస్‌గఢ్ నుంచి ఖమ్మానికి గ్రానైట్ రాయిని లారీలో తరలిస్తున్నారు. మార్గమధ్యంలో లారీ అదుపుతప్పడంతో లారీపై ఉన్న పెద్ద రాయి క్యాబిన్‌పై పడి షబీర్, రాజిరెడ్డి అక్కడిక్కడే మృతిచెందారు.

పెండింగ్ డీఏ, బిల్లులు ఇవ్వాలి

ఖమ్మం ఎడ్యుకేషన్, మార్చి 10: ప్రభుత్వ ఉపాధ్యాయుల పెండింగ్ డీఏ, బిల్లులను విడుదల చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోతుకూరి మధు ప్రభుత్వాన్ని కోరారు. ఖమ్మంలోని జిలా కార్యాలయంలో ఆదివారం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. 317 జీవోతో నష్టపోయిన ఉపాధ్యాయులను వారు కోరితే పూర్వ జిల్లాకు పంపాలని కోరారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
jobs Apply Now!
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-311806-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నలుగురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

రూ.7.4లక్షల సొత్తు స్వాధీనం

మాట్లాడుతున్న ఏసీపీ అనిశెట్టి రఘు

కల్లూరు, మార్చి 10: ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో పలు దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు అంతరాష్ట్ర దొంగలను ఆదివారం కల్లూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఏసీపీ అనిశెట్టి రఘు తెలిపారు. కల్లూరు పోలీసుస్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. సత్తుపల్లి మండలం రామానగరానికి చెందిన నీలాల అనిల్‌కుమార్, మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన భీమిలి రాజ్‌కుమార్, ములకలపల్లి మండలం వేముకుంటకు చెందిన కారం రాము, రాజ్‌కుమార్‌ను విశ్వసనీయ సమాచారం మేరకు కల్లూరు ఎస్సై షాకీర్ కారులో వెళ్తుండగా అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని విచారించారు. వీరి వద్ద నుంచి 97 గ్రాముల బంగారం, 120 గ్రాముల వెండి, మూడు ద్విచక్రవాహనాలు కలిపి మొత్తం రూ.7.4లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై భద్రాద్రి కొత్తగూడెం, సత్తుపల్లి, ఇల్లెందు, అన్నపురెడ్డిపల్లి, వరంగల్ జిల్లా నర్సంపేట, కరీంనగర్ పోలీస్‌స్టేషన్లతో పాటు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా, ఏలూరు జిల్లాల్లో పలు కేసులు నమోదైనట్లు ఏసీపీ తెలిపారు. అనిల్‌కుమార్‌పై 27 కేసులు, రాజ్‌కుమార్‌పై 15 కేసులు నమోదైనయ్యాయని, అదుపులోకి తీసుకున్న వీరిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. దొంగలను పట్టుకునేందుకు సహకరించిన సీసీఎఫ్ ఏసీపీ రవి, సత్తుపల్లి సీఐ కిరణ్, కల్లూరు ఎస్సై షాకీర్‌ను ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అభినందించారు.

నగరంలో 'జై తెలంగాణ' నినాదాలు

నినాదాలు చేస్తున్న ఉద్యమకారులు

రఘునాథపాలెం, మార్చి 10: నగరంలో ఆదివారం 'జై తెలంగాణ' నినాదాలు వినిపించాయి. తెలంగాణ మలి దశ ఉద్యమంలో కీలక ఘట్టమైన మిలియన్ మార్చ్‌కు 13 వసంతాలు పూర్తయిన సందర్భంగా, అందులో పాల్గొన్న ఉద్యకారులు ఆదివారం నగరంలోని అమరవీరుల స్థూపం వద్ద కలుసుకున్నారు. 'జై తెలంగాణ' నినాదాలు చేశారు. మిలియన్ మార్చ్ అనుభవాలను పంచుకున్నారు. మలక సురేశ్, డోకుపర్తి సుబ్బారావు, నరేందర్, రమాదేవి, కుమారి, శ్రీనివాస్, ఉదయ్ భాస్కర్, వెంకటేశ్వర్లు, రఘు, ఆసిఫ్ అహ్మద్, నాగుల్‌మీరా, బుడాన్, రమేశ్ పాల్గొన్నారు.

ఇల్లెందు రోడ్డు విస్తరణకు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

రఘునాథపాలెం, మార్చి 10: రఘునాథపాలెం నుంచి బూడిదంపాడు గ్రామ శివారు వరకు రోడ్డును రూ.38.30 కోట్ల వ్యయంతో నాలుగు వరుసల రోడ్డుగా విస్తరించనున్నారు. ఈ పనులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం బూడిదెంపాడులో ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశమయ్యారు. మండల అభివృద్ధిపై సమీక్షించారు. ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యాంప్రసాద్, ఎంపీపీ గౌరి, జడ్పీటీసీ సభ్యురాలు మాలోత్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలికల హాస్టల్ డే..

మాట్లాడుతున్న కస్తాల సత్యనారాయణ

ఖమ్మం, మార్చి 10: నగరంలోని ఎస్సీ ఆనంద నిలయం బాలికల హాస్టల్‌లో ఆదివారం హాస్టల్ డే జరిగింది. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థినులు బాగా చదివి, మంచి ఫలితాలు సాధించి, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వసతి గృహ సంక్షేమ అధికారి ఎం.విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీహెచ్‌డబ్ల్యూవోఎస్ ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు, ఖమ్మం డివిజన్ ఏఎస్‌డబ్ల్యూఓ ఎ.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల ఊరేగింపు

రథంపై శివపార్వతుల ఊరేగింపు

కూసుమంచి, మార్చి 10 : కూసుమంచిలో శివపార్వతులను శనివారం రాత్రి ఘనంగా ఊరేగించారు. శివాలయంలోని ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పుష్పాలంకరణ రథంపై ఉంచి ప్రధాన రహదారి నుంచి బస్టాండ్ వరకు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ డీసీసీ వీరప్రతాపరెడ్డి, రేలా ప్రదీప్‌రెడ్డి, ఈవో శ్రీకాంత్, సుధాకర్‌రెడ్డి, మోహన్, వీరభద్రం, జనార్దన్, శ్రీను, రవి, వీరబాబు, రెడ్యానాయక్ శివస్వాములు, భజన కోలాట బృందాలు పాల్గొన్నారు. శివరాత్రి ఉత్సవాలు ముగియడంతో శివ మాలధారణ భక్తులు మాలలు తీసి వేశారు. శివరాత్రి సందర్భంగా రూ.9,59,832 ఆదాయం వచ్చినట్లు ఈవో శ్రీకాంత్ తెలిపారు.

సావిత్రీబాయి పూలేకు నివాళి

నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మం సిటీ, మార్చి 10: అణగారిన వర్గాల అభ్యున్నతికి, మహిళల చదువుకు కృషి చేసిన సావిత్రీబాయి పూలే వర్ధంతిని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా ఆదివారం నగరంలోని దళిత-బహుజన కార్యాలయంలో నిర్వహించింది. చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ, బెల్లంకొండ శ్యామల మాదిగ, నాగమణి మాదిగ, వీరమ్మ మాదిగ, పద్మ మాదిగ, కొండపల్లి మధు మాదిగ, చెరుకుపల్లి చిన్న భద్రయ్య మాదిగ, కొమ్ము రాజేష్ మాదిగ పాల్గొన్నారు.

చైతన్య టెక్నో స్కూల్ వార్షికోత్సవం

సత్తుపల్లి టౌన్, మార్చి 10: పట్టణంలోని చైతన్య టెక్నో స్కూల్ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి, డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందినిలు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గత ఏడాది పదవతరగతిలో 10/10 జీపీఏ సాధించిన విద్యార్థులను, యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ వై మురళీకృష్ణ, డైరెక్టర్లు సుజాత, రాకేశ్, రవికుమార్, ఏసుబాబు, వై ఉష, రాధ, అధ్యాపక బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి వితరణ

ఎర్రుపాలెం, మార్చి 10 : తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్య అన్నదానానికి దాతలు ఆదివారం ఆర్థికసాయం అందించారు. రాట కొండ శ్రీరాఘవ జ్ఞాపకార్థం తల్లి శ్రీలత, మదర్ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్ మదనపల్లి అన్నమయ్య జిల్లా వారు రూ.50,116, పంగా ఉమాదేవి జ్ఞాపకార్థం భర్త అనంతరామయ్య రూ.50,116 వితరణ అందించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు కే.విజయకుమారి, ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్, ఉపప్రధాన అర్చకులు విజయశర్మ పాల్గొన్నారు.

వీరరాఘవస్వామి కల్యాణం

పూజలు చేస్తున్న భక్తులు

పెనుబల్లి, మార్చి 10: మండలంలోని తాళ్లపెంటలోని వీరరాఘవ స్వామి కల్యాణాన్ని ఆదివారం అర్చకులకు నిర్వహించారు. శివరాత్రి పండుగ మరుసటి రోజు కల్యాణం జరపడం ఆనవాయితీ. జాతరకు తాళ్లపెంట, బ్రాహ్మళకుంట, బత్తులపల్లి, కప్పలబంధం, కల్లూరు, టేకులపల్లి, వీ.ఎం.బంజర, పెనుబల్లి, గంగదేవిపాడు, లింగగూడెం, బెండాలపాడు గ్రామాల ప్రజలు జాతరలో పాల్గొన్నారు. ఆదివారం సాయంత్రం ప్రబబండ్లు ఊరేగింపుగా బయలుదేరి పొలిమేరలో ఉన్న ముత్యాలమ్మ ఆలయం వద్ద పూజలు చేశారు.

వేలాంగిణి చర్చిలో ప్రార్థనలు

ప్రార్థనలు చేస్తున్న విచారణ గురువులు

కల్లూరు, మార్చి 10: కల్లూరు లిటిల్‌ఫ్లవర్ చర్చి విచారణ గురువులు ఫాదర్ సురేశ్ జోష్, ఫాదర్ ఆనంద్, ఫాదర్ విజయ్ ఆధ్వర్యంలో ఉపవాస దినాల్లో భాగంగా ఆధ్యాత్మిక తీర్థ యాత్రల్లో క్రైస్తవులు పాల్గొన్నారు. తమిళనాడులోని 10 పుణ్యక్షేత్రాలను దర్శించుకుని ఆదివారం తమిళనాడులోని ప్రముఖ క్రైస్తవ పుణ్యక్షేత్రమైన వేలాంగిణి చర్చిలో 150 మంది సంఘ క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

విశ్వధర్మక్షేత్రంలో ఎమ్మెల్యే రాగమయి పూజలు

పూజలు చేస్తున్న మల్లు నందిని, ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి రూరల్, మార్చి 10: మండలంలోని బుగ్గపాడు గ్రామంలో విశ్వధర్మ క్షేత్రంలో ఆదివారం ఎమ్మెల్యే మట్టా రాగమయి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయకమిటీ ఆధ్వర్యంలో వారికి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ నిర్వాహకులు తుమ్మూరు శ్రీరామప్రసాద్, అర్చకుడు వెల్లటూరి ప్రసాదాచార్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జ్యోతి నిలయం చర్చిలో వైద్యశిబిరం

సత్తుపల్లి టౌన్, మార్చి 10: పట్టణంలోని జ్యోతి నిలయం చర్చిలో క్రీస్తు శ్రమలకాల సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం, ఆరోగ్య వైద్యశిబిరాన్ని ఆదివారం ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానం చేయడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. చర్చి నిర్వాహకులు, సంఘస్తులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

జాతరను సందర్శించిన వైరా ఎమ్మెల్యే

జాతరను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరారూరల్, మార్చి 10: జాతరకు వచ్చిన భక్తులకు ఇబ్బందుల లేకుండా చూడాలని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నారు. ఆదివారం స్నానాల లక్ష్మీపురం తిరునాళ్ళ జాతరను ఆయన భక్తులతో కలిసి కలియతిరిగారు. దేవస్థానం వారు భక్తులకు ఏర్పాటు చేసిన వసతులను అడిగి తెలుసుకున్నారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు సూచనలు చేశారు. అనంతరం జాతరలో ఆలయ కమిటీ నిర్వహించిన మ్యూజికల్ నైట్‌ను తిలకించారు. కార్యక్రమంలో పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, నూతి సత్యనారాయణ, శీలం వెంకటనర్సిరెడ్డి, దొడ్డా పుల్లయ్య, పమ్మి అశోక్, మల్లు రామకృష్ణ, స్వర్ణ నరేంద్ర, నూతి బాబు, భువనేశ్వర్ రాజు, జన్ను, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నిరసనను విజయవంతం చేయండి

వైరాటౌన్, మార్చి 10: సీపీఐ(ఎం) వైరాపట్టణ కమిటీ ఆధ్వర్యంలో నేడు వైరా మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్ కోరారు. ఆదివారం సుంకర సుధాకర్ మాట్లాడుతూ.. వైరా మున్సిపాలిటీలో ఇంటి పన్నులను భారీగా పెంచడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 28న మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టినప్పుడు పై అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని మున్సిపాలిటీ కమిషనర్ వేణు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నేడు అధికంగా విధించిన ఇంటి పన్నులను సవరించకుండా యథావిధగా ఇంటి పన్నుల వసూలు కొనసాగిస్తూ మాట తప్పారని విమర్శించారు. అధికంగా విధించిన ఇంటి పన్నులను సవరించే వరకు పన్నుల వసూలు నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం 11గంటలకు వైరా మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట జరుగు నిరసన కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు, పార్టీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

టేకులపల్లిలో బోరు ఏర్పాటు

పెనుబల్లి, మార్చి 10: వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలోని టేకులపల్లిలోని కాలువ ఒడ్డున గ్రామస్తులు బోరు వేశారు. కాలువలో రెండు నెలలుగా కాలువల్లో చుక్క నీరు లేకపోవ డం, భూగర్భజలాలు అడుగంటడంతో గ్రామస్తులంతా కలిసి బోరు ఏర్పాటు చేశారు.

కోటమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

పూజల్లో భక్తులు

కారేపల్లి,మార్చి 10: మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి కోటమైసమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దేవాయల పూజారి కొత్తలంక కైలాస శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేక, గోత్ర నామ పూజలు చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. పలువురు కొత్త వాహనాలకు పూజలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పర్సా పట్టాభి రామరావు, దేవాదాయశాఖ అధికారి శ్రీనివాసాచార్యులు, సిబ్బంది మోహన్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

'మిషన్ భగీరథ' కోసం..

పాలేరు ఇన్‌టేక్‌వెల్ వద్ద కాలువ తీస్తున్న జేసీబీ

కూసుమంచి, మార్చి 10 : పాలేరు రిజర్వాయర్ సమీపంలోని మినీహైడెల్ కాలువ పక్కనే గల పాత పంప్‌హౌజ్‌లో మిషన్ భగీరథ అధికారులు జేసీబీతో కాలువ తీయించారు. పాలేరు జలాశయం నీటిమట్టం తగ్గడంతో కాలువ కొట్టి పంప్‌హౌజ్‌కు నీటిని అందిస్తున్నారు. నీటిమట్టం 10అడుగులకు తగ్గితే పంప్‌హౌజ్‌కు నీరు అందదు.. దీంతో ఆయా గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా నిలిచిపోతుంది.

80 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

తిరుమలాయపాలెం, మార్చి 10 : మండలంలోని గోపాలపురం గ్రామంలో శనివారం అర్ధరాత్రి 80 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. పిండిప్రోలు గ్రామానికి చెందిన మడికంటి రాము ప్రజల వద్ద నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తూ అక్రమంగా తరలిస్తున్నాడు. ఈక్రమంలో చుట్టుపక్కల గ్రామాల్లో కొనుగోలు చేసిన బియ్యాన్ని గోపాలపురంలోని ఓ ఇంట్లో నిల్వ చేశాడు. ఆ బియ్యాన్ని ఖమ్మం పట్టణానికి చెందిన వ్యాపారి జగదీశ్‌తో కలిసి తరలించేందుకు డీసీఎం వ్యాన్‌లో లోడ్ చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి బియ్యంతో ఉన్న డీసీఎం వ్యాన్‌ను తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాము, జగదీశ్, వ్యాన్‌డ్రైవర్ షకీల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మధిరలో ఆర్టీసీ డ్రైవర్ల ఆందోళన

గుదిబండగా మారిన బ్రీత్ ఎనలైజింగ్ టెస్టు

మద్యం తాగకున్నా తాగినట్లు చూపిస్తున్న మెషన్

ధర్నా నిర్వహిస్తున్న ఆర్టీసీ కార్మికులు

మధిర, మార్చి 10 : మధిర ఆర్టీసీ డిపోలో ఉన్న బ్రీతింగ్ ఎనలైజర్ టెస్టు మెషన్ మద్యం తాగకున్నా తాగినట్లు చూపిస్తుండడంతో డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ఆదివారం డ్రైవర్ సంద్ర నాగేశ్వరరావుకు ఇదే పరిస్థితి ఎదురుకావడంతో డిపో గేటు ఎదుట ధర్నాకు దిగాడు. సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ నాయకులు బెజవాడ రవిబాబు, శీలం నరసింహారావు, కొమరంపుడి చంటి, మద్దాల ప్రభాకర్, ఆర్టీసీ కార్మికులు నాగేశ్వరరావుకు అండగా నిలిచారు.

విద్యార్థుల అ'పూర్వ' సమ్మేళనం

సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఎర్రుపాలెం, మార్చి 10 : మండల పరిధిలోని మీనవోలు జిల్లా ప్రజాపరిషత్ హైస్కూల్‌లో 1995-96 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శనివారం కలుసుకున్నారు. ఆటపాటలతో అప్పటి జ్ఞాపకాలు తలుచుకుంటూ సంబురంగా గడిపారు. గురువులను విద్యార్థులందరూ కలిసి శాలువాలు కప్పి సన్మానించారు. ఉపాధ్యాయులు పారుపల్లి వెంకటేశ్వరరావు, మందయ్య, శంకర్‌రప్రసాద్, సీతామహాలక్ష్మి, లలిత, విద్యార్థులు సుధాకర్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, విజయ్‌బాబు పాల్గొన్నారు.

మధిర సీపీఎస్ స్కూల్ విద్యార్థులూ..

సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మధిర, మార్చి 10 : మధిర సీపీఎస్ స్కూల్‌లో 40 సంవత్సరాల క్రితం విద్యనభ్యసించిన పూర్వవిద్యార్థులు ఆదివారం మధిరలోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో గెటుగెదర్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు తమ బాల్య జీవిత మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు.

కాపు కార్పొరేషన్‌పై స్పష్టత ఇవ్వాలి

ఖమ్మం సిటీ, మార్చి 10: మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామన్న కాంగ్రెస్ ఎన్నికల హామీ అమలుపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పార్లమెంట్ ఎన్నికల్లోపు స్పష్టత ఇవ్వాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ కోరారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ నెల 12న జరుగనున్న మంత్రివర్గ సమావేశంలో కాపు కార్పొరేషన్ ఏర్పాటుపై నిర్ణయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర జనాభాలో కాపుల సంఖ్య 54 శాతంగా, బీసీల్లో 24 శాతంగా ఉందని అన్నారు. కార్పొరేషన్ హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు పారా నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ, నాయకులు రవి, సంజీవ్, విజయ్‌కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

సంక్షిప్తం

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ప్రవేశానికి పరీక్ష

ఖమ్మం, మార్చి 10: నగరంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఐదు నెలల శిక్షణకు ఆదివారం ప్రవేశ పరీక్ష జరిగింది. దరఖాస్తు చేసిన 539 మందిలో 380 మంది హాజరయ్యారు. మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా 100 మందిని ఎంపిక చేయనున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ తెలిపారు.

ప్రభుత్వ డ్రైవర్ల సంఘం సమావేశం

ఖమ్మం మార్చి 10: తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఉమ్మడి జిల్లా సమావేశం నగరంలోని కార్యాలయంలో ఆదివారం జరిగింది. వివిధ అంశాలపై తీర్మానాలను ఆమోదించింది. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హకీమ్ మాట్లాడారు. నాయకులు ఎస్.హరినాథ్‌బాబు, ఎస్‌కె.ఖాజా, ఎస్‌కె.నయీమ్, ఎం. బాబూరావు, గౌరీరాజు రాములు, జి.విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఉపాధి వేతనాలు ఇవ్వాలి

మాట్లాడుతున్న దండు ఆదినారాయణ

సత్తుపల్లి, మార్చి 10: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కూలీ వేతనం వెంటనే ఇవ్వాలని, పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కిష్టాపురంలో హసావత్ అలివేలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ కూలీల పట్ల మోదీ ప్రభుత్వం వంచనకు పాల్పడుతుందని, రెండు నెలలుగా కూలీ రాక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కునుసోతు వెంకమ్మ, శంకర్, సునీత, రమణ, వెంకమ్మ, సత్యవతి, రాములమ్మ, కుమారి పాల్గొన్నారు.

ఎల్ వోసీ అందజేత

సత్తుపల్లి, మార్చి 10: మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన జల్లి మీనాక్షికి మంజూరైన రూ.2లక్షల ఎల్‌వోసీని ఎమ్మెల్యే మట్టా రాగమయి